## అగ్నికి ఆహుతైన జామాయిల్, సుబాబుల్ తోటలు






www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
సోమవారం | 25 | మే | 2026
పేజీలు : 6

# సమాజ ఉన్నతిలో జర్నలిస్టులే కీలకం












**- అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు**
**పోరాటాలతోనే హక్కులు, సంక్షేమం : కూనంనేని**
**జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే ధ్యేయం : విరహత్ అలీ**
**- హక్కుల పరిరక్షణకోసం నిరంతరం పోరాడాలి : రాంనారాయణ**
**- ఘనంగా టియూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా 3వ మహాసభ**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జర్నలిస్టుల హక్కుల రక్షణకు వారి సమస్యల పరిష్కారానికి నిరతంర పోరాడాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు (ఐజేయు) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా తృతీయ మహాసభ ఆదివారం జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం క్లబ్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యాతిధిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సమాజ శ్రేయస్సులో జర్నలిస్టుల బాధ్యతలు అత్యంత కీలకమైనవి అన్నారు. ప్రజా స్వామ్య పరిరక్షణలో నాల్గో స్తంబంగా జర్నలిస్టులు పోషిస్తున్న పాత్ర అమోఘం అన్నారు. క్షేత్రస్థాయిలో అనేక సవాళ్లు, ఇబ్బందులను ఎదుర్కొంటూ సాహసోపేతంగా విధులు నిర్వహిస్తున్నారని అభినందించారు. కాగా ప్రస్తుతం తరణంలో

మిగతా 2లో..

## మచ్చలేని మహోన్నత నేత గిరిప్రసాద్



**-సంక్లిష్ట స్థితికి దారితీస్తున్న మోడీ పాలన**
**-గిరిప్రసాద్ వర్ధంతి సభలో బాగం**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** తుదిశ్వాస వరకు ప్రజల పక్షాన నిలబడి చారిత్రిక పోరాటాలకు నేతృత్వం వహించిన సిపిఐ అగ్రనేత గిరిప్రసాద్ మచ్చలేని మహోన్నత నాయకుడని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. ఉన్నత విద్యను అభ్యసించి సామాజిక పరిస్థితులను అధ్యయనం చేసి సాయుధుడై ముందుకు సాగిన గిరిప్రసాద్ సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులను ముందే అంచనా వేసిన కమ్యూనిస్టు తత్వవేత్త అని ఆయన తెలిపారు.నల్లమల గిరి ప్రసాద్ 40వ వర్ధంతి సందర్భంగా సిపిఐ కార్యాలయంలో ఎస్‌కె జానిమియా అధ్యక్షతన జరిగిన సభలో బాగం హేమంతరావు ప్రసంగించారు. వర్ధంతి సభకు ముందు పాత బస్టాండ్ సమీపంలోని గిరిప్రసాద్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గిరిప్రసాద్ విగ్రహం వద్ద సిపిఐ పతాకాన్ని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి ఆవిష్కరించారు. వర్ధంతి సభలో హేమంతరావు మాట్లాడుతూ సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన గిరిప్రసాద్ మహోన్నత తెలంగాణ సాయుధ పోరాటంలో సాయుధ దళ నేతగా పని చేశారన్నారు. వేలాది ఎకరాల భూమిని పంపిణీ చేస్తూ వందల గ్రామాలను విముక్తి చేసిన చరిత్ర గిరిప్రసాద్ ది అన్నారు. ఆయన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో తుపాకీ గుండు మచ్చ తప్ప మరోక

మిగతా 2లో..

## పంట అవశేషాలను కాల్చకుండా
# అవగాహన కల్పించాలి



**-ఖమ్మం జిల్లాలో ధాన్యం కొనుగోలు సజావుగా సాగుతున్నాయి**
**-గంటల వ్యవధిలోనే ఖాతాల్లోకి చెల్లింపులు**
**-డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క**
**-మే చివరి నాటికి ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలి**
**-మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**
**-వీడియో కాన్ఫరెన్స్‌లో ఖమ్మం కలెక్టరేట్ నుంచి పాల్గొన్న డిప్యూటీ సిఎం**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పంట అవశేషాలను కాల్చవద్దని గ్రామాల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఉప ముఖ్యమంత్రి మల్లుభట్టివిక్రమార్క తెలిపారు. ధాన్యం కొనుగోళ్లపై రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు , పౌర సరఫరాల శాఖ కమిషనర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో ఖమ్మం కలెక్టరేట్ నుంచి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తో కలిసి పాల్గొన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లను అనేక సవాళ్ల మధ్య విజయవంతంగా నిర్వహించిన పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి అభినందనలు తెలిపారు. ఈ ఏడాది భారీ స్థాయిలో వరి దిగుబడి వచ్చినప్పటికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు కొనసాగుతున్నాయని తెలిపారు. ఇటీవల మంత్రి వర్గం సన్‌ఫ్లవర్ పంట

మిగతా 2లో..

# సమాజ ఉన్నతిలో జర్నలిస్టులే కీలకం

**(మొదటిపేజీ తరువాయి)**
కొన్ని మీడియా సంస్థల తీరు మారాల్సిన అవసరం ఉందని, నిత్యం పనిచేసే జర్నలిస్టులకు శ్రమకు తగిన వేతనాలు ఇవ్వాలన్నారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా మాట్లాడుతూ జర్నలిస్టుల సుదీర్ఘ కాల సమస్య అయిన ఇళ్ల స్థలాలు దక్కేంత వరకు తామే వ్యక్తిగతంగా పార్టీ పరంగా అండగ ఉంటామన్నారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వం చొరవ చూపి హెల్త్ కార్డులు, ఇండ్ల స్థలాలు మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. సమాజంలో నిష్పక్షపాత వైఖరితో వార్తలు రాసేటప్పుడు జర్నలిజం విలువలు కాపాడపడతాయని, వృత్తి పరమైన బాధ్యతను విస్మరించరాదని సూచించారు. జర్నలిస్టులంతా ఐఖ్యతతో ముందుకు సాగాలని అప్పుడే హక్కుల సాధన సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. జర్నలిస్టుల సంక్షేమానికి వారి కుటుంబాల భద్రతకు ఎల్లప్పుడు తమ సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు.

**జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే ధ్యేయం : విరహత్ అలీ**

జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా టియూడబ్ల్యూజే (ఐజేయు) నిరంతరం పోరాటాలు సాగిస్తుందని ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అలీ అన్నారు. టియూడబ్ల్యూజే (ఐజేయు) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 3వ మహాసభ పూర్వ అధ్యక్షులు ఇమ్మంది ఉదయ్ కుమార్ అధ్యక్షతన ఆదివారం జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం క్లబ్‌లో ఘనంగా జరిగింది. ఇందులో భాగంగా మృతి చెందిన జర్నలిస్టు మిత్రుల జ్ఞాపకార్థం మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 70 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర గలిగిన జర్నలిస్టు యూనియన్‌లో సభ్యులుగా ఉండటం మనందరి అదృష్టమన్నారు. ఆ నాటి నుండి నేటి వరకు యూనియన్ జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతోందని చెప్పారు. తెలుగు రాష్ట్రాల్లో బలమైన యూనియన్‌గా ఉందని, దేశంలోనే నెంబర్ వన్ సంఘంగా ముందుకు దూసుకుపోతున్నట్లు తెలిపారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు, అక్రిడేషన్ కార్డులు, హెల్త్ కార్డుల కోసం నిరంతరం ప్రభుత్వానికి వినతులు అందిస్తూనే ఉన్నామని, ఉమ్మడి తెలుగు రాష్ట్రం వ్యాప్తంగా ఇప్పటికే 47 వేల అక్రిడేషన్ కార్డులు ఉన్నాయని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి సానుకూలంగా ఉన్నారని చెప్పారు. ప్రజలు, ప్రభుత్వానికి వారధి అయిన జర్నలిజం వృత్తి ఎంతో పవిత్రమైందని, అలాంటి వృతి కొందరి కారణంగా దిగజారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వృత్తికే కళాంకాన్ని తెచ్చే కలుపు మొక్కల భరతం పట్టాలని చెప్పారు. బ్లాక్ మెయిల్ చేసే వాళ్ల కారణంగా నిబద్ధత గల జర్నలిస్టులు అనేక చీదరింపులకు గురవుతున్నారని, అలాంటి వారిని వెతికిపట్టుకుని వృత్తి నుండి తప్పించాలన్నారు. సమాజాన్ని జాగృతం చేయాలనే తపన జర్నలిస్టుల మదిలో అనునిత్యం ఉండాలని, అలాంటి వారికి సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమానికి టియూడబ్ల్యూజే (ఐజేయు) నిత్యం ముందడుగులో ఉంటుందని, వృత్తిలో ఎదురయ్యే ఆటుపోట్లకు జర్నలిస్టులు భయపడకుండా నిజాన్ని నిర్భయంగా బహిర్గతం చేయాలన్నారు.

**హక్కుల పరిరక్షణ కోసం నిరంతర పోరాటాలు చేయాలి : రాంనారాయణ**

కత్తిమీద సాములాంటిది ఇ జర్నలిస్టు వృత్తని, అలాంటి జర్నలిస్టులు సమాజ మేలుతో పాటు తమ హక్కుల సాధన కోసం నిరంతర పోరాటాలు చేయాలని టియూడబ్ల్యూజే (ఐజేయు) రాష్ట్ర కార్యదర్శి కె రాంనారాయణ అన్నారు. అనగారిన వర్గాల గొంతుకగా జర్నలిస్టులు ఉన్నారని, అలాంటి జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు, హెల్త్ కార్డులు, అక్రిడేషన్ కార్డుల కోసం యూనియన్ తొలినాళ్ల నుండి రాజీలేని పోరాటం సాగిస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతీ జర్నలిస్టులకు ప్రభుత్వం ద్వారా సంక్షేమ ఫలాలు అందించాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర తొలి ప్రభుత్వంలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నోచుకోక పోవడంతో దేశరాజధాని ఢిల్లీలోని జంతర్మంతర వద్ద మన గళం వినిపించామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ప్రెస్ అకాడమి చైర్మన్ కే శ్రీనివాసరెడ్డితో కలిసి యూనియన్ అధ్వర్యంలో ముఖ్యమంత్రిని కలిసి వివరించామని, వాటి పరిష్కారానికి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం నిరంతర కృషి సాగుతోందని, నూతనంగా ఏర్పాటైన జిల్లా కార్యవర్గం ప్రతీ మూడునెలలకోసారి సమావేశాలు ,సెమినార్లు నిర్వహించుకోవాలని, నానాటికి పెరుగుతున్న శాస్త్ర సాంకేతిక రంగాన్ని అందిపుచ్చుకుని వృత్తిలో నైపుణ్యాన్ని మరింతగా పెంచుకోవాలని సూచించారు.

**పరుదులు దాటుతున్న జర్నలిజం తీరు : ఏనుగు వెంకటేశ్వరరావు**

ఒకప్పుడు ఎంతో గౌరవప్రథమైన జర్నలిజం వృత్తి ఇప్పుడు పరుదులు దాటుతోందని, తద్వారా అనేక సవాళ్లు ఎదుర్కోవాల్సి వస్తోందని టియూడబ్ల్యూజే (ఐజేయు) ఖమ్మం జిల్లా అధ్యక్షులు ఏనుగు వెంకటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా మహాసభకు ప్రత్యేక ఆహ్వానితునిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పరుదులు దాటి ప్రవర్తించడం సరైంది కాదన్నారు. వార్త సేకరణ విషయంలో నేడు అనేక సవాళ్లను జర్నలిస్టులు ఎదుర్కోవాల్సి వస్తోందని, గ్రామీణ ప్రాంతాల్లో ఈ సమస్య మరింత ఇబ్బందిగా మారిందన్నారు. ప్రభుత్వం అర్హులైన జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డుల జారీ విషంయంలో పరుదులు విధిస్తోందని, కాని ప్రభుత్వంలోని పెద్దలు ప్రజా ధనాన్ని ఎలాంటి పరుదులు లేకుండా ఇష్టాను సారంగా ఖర్చు ఖర్చు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఆయా నియోజకవర్గాల ఎంఎల్‌ఏలు సహకరించాలని, రాష్ట్రంలోనే భద్రాద్రి జిల్లా యూనియన్ బలంగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం పలువురుని సన్మానించి పుష్పగుచ్చాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ కార్యవర్గ సభ్యులు వేణు, ఎల్క్ట్రానిక్ మీడియా రాష్ట్ర నాయకులు వెంకటరావు, నేషన్ కౌన్సిల్ మెంబర్ బివి రమణారెడ్డి, ఇమ్మంది ఉదయ్ కుమార్, మొబగాపు ఆనంద్ కుమార్, శీనివాసరావుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## పంట అవశేషాలను కాల్చకుండా అవగాహన కల్పించాలి




**(మొదటిపేజీ తరువాయి)** కొనుగోలుకు ఆమోదం తెలిపిందని ఇందుకు అవసరమైన ఏర్పాట్లు వెంటనే చేయాలని అధికారులను ఆదేశించారు. ఖమ్మం జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు సజావుగా కొనసాగుతున్నాయని అధికారులు సమర్థవంతంగా పనిచేశారని ఉప ముఖ్యమంత్రి ప్రశంసించారు. జిల్లాలో ఇప్పటి వరకు 123560 మెట్రిక్ టన్నుల ధాన్యం రాగా అందులో 112922 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామన్నారు. ప్రస్తుతం కొనుగోలు కేంద్రాల్లో సుమారు 10వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే ఉందన్నారు. గతంలో రైతులకు ధాన్యం చెల్లింపులు నెలల తరబడి పెండింగ్‌లో ఉండి తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యేవని ప్రస్తుతం ప్రజా ప్రభుత్వ పాలనలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో గంటల వ్యవధిలోనే రైతుల ఖాతాల్లో చెల్లింపులు జరుగుతున్నాయన్నారు. పట్టణాభివృద్ధిలో వాయు కాలుష్య నియంత్రణ కీలకమని పంట అవశేషాలను కాల్చడం కూడా వాయుకాలుష్యానికి ప్రధాన కారణాల్లో ఒకటని, దీనివల్ల కాలుష్యంతో పాటు పక్క పొలాలకు మంటలు వ్యాపించి ప్రమాదాలు కూడా జరుగుతాయన్నారు. గ్రామాల్లో పంట అవశేషాలను కాల్చకుండా టామ్ టామ్ ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఆ తర్వాత కూడా కాల్చేందుకు ప్రయత్నిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ మే చివరి నాటికి ధాన్యం కొనుగోళ్లు వంద శాతం పూర్తయ్యేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్థానికంగా ఉండే హమాలీలు రవాణా సమస్యల పరిష్కారానికి మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. వంద శాతం పెండింగ్ రైస్ డెలివరీ పూర్తి చేసిన డిఫాల్ట్ రైస్ మిల్లర్ల నుంచి అండర్ టెకింగ్ తీసుకుని ధాన్యం కేటాయింపు చేయాలని తెలిపారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ మంత్రి వర్గం సన్‌ఫ్లవర్ కొనుగోలుకు ఆమోదం తెలిపిందని అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలన్నారు. చివరి గింజ వరకు పంట కొనుగోలు జరిగేలా చూడాలని వరి కొయ్యలను కాల్చకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## మచ్చలేని మహోన్నత నేత గిరిప్రసాద్




**(మొదటిపేజీ తరువాయి)** మచ్చ లేదని హేమంతరావు స్పష్టం చేశారు. శాసనసభ్యునిగా, రాజ్యసభ సభ్యునిగా, ఖమ్మం జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర కార్యదర్శిగా, జాతీయ ఉప ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన గిరిప్రసాద్ భారతదేశ రాజకీయ చిత్ర పటంపై తనకంటూ ఒక సుస్థిర స్థానాన్ని సంపాదించుకు న్నారన్నారు. సామాజిక సమస్యల పట్ల అవగాహన, గొప్ప పోరాట కార్యాచరణ కలిగిన గిరిప్రసాద్ నేటి తరాలకు మార్గదర్శి అన్నారు. భారతదేశం సంక్లిష్ట స్థితిని ఎదుర్కొంటున్న నేటి పరిస్థితుల్లో గిరిప్రసాద్ ఆశయ సాధన కోసం పోరాడటమే ఆయనకు మనమిచ్చే ఘన నివాళి అని హేమంతరావు తెలిపారు. ఈ దేశం ఒక సంక్లిష్ట స్థితిని ఎదుర్కొంటుందని యువత మోడీ ప్రజా వ్యతిరేక విధానాలపై తిరుగుబాటుకు సమాయత్తం అవుతున్నారన్నారు. ఈ దేశాన్ని నిరుద్యోగం, అవినీతి పట్టి పీడిస్తున్నాయని అదే సమయంలో ఉపాధి, ఉద్యోగ కల్పన రంగాలు పూర్తిగా ఉనికిని కోల్పోతున్నాయన్నారు. ప్రభుత్వానికి వత్తాసు పలుకుతూ ప్రకటనలు చేస్తున్న కార్యనిర్వహక వర్గం ప్రజల ముందు దోషిగా నిలబడే ప్రమాదం ఉందని ఒక న్యాయమూర్తి వ్యాఖ్యలు దేశంలో ఒక గొప్ప కదలికకు కారణమయ్యాయని ఈ సందర్భంగా హేమంతరావు గుర్తు చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం అధ్యయనం చేస్తూ క్రియాశీలకంగా వ్యవహరించడమే దివంగత నేతలకు సరైన నివాళి అన్నారు. ఈ సభలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, పోటు కళావతి, తోట రామాంజనేయులు, రావి శివరామకృష్ణ, మిడికంటి వెంకటరెడ్డి, మేకల శ్రీనివాసరావు,సాంబశివరెడ్డి, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు బత్తినేని నీరజ , జిల్లా నాయకులు గాదె లక్ష్మి నారాయణ, ఏసు, మోహన్‌రావు, కృష్ణమూర్తి, రమేష్, కృష్ణ పాల్గొన్నారు.

## మండుటెండలో న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని దీక్ష

**-వివోఏల దీక్షలో స్పృహ కోల్పోయిన వివోఏ అరుణ**
**ప్రభుత్వం స్పందించి వివోఏలకు కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్**



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోరుతూ మే 18 నుండి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా తలపెట్టిన వివో ఏల సమ్మెలో భాగంగా తిరుమలయపాలెం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న వివోఏల మూడవరోజు దీక్షలో విషాదం చోటుచేసుకుంది. మండలంలోని బచ్చోడు గ్రామానికి చెందిన వివోఏ పోలిశెట్టి అరుణ ఒక్కసారిగా దీక్షలో స్పృహ కోల్పోవడంతో భయభ్రాంతులకు గురయ్యారు. అప్పటివరకు తోటి వివోఏలతో దీక్షలో పాల్గొన్న అరుణ ఒక్కసారిగా స్పృహ కోల్పోయి కింద పడిపోవటంతో తోటి వివోఏలు అయోమయమయ్యారు. వెంటనే ఆమెను దగ్గర్లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సను అందించారు. ఉదయం నుండి అరుణ దీక్షలో



పాల్గొని భోజనం చేయకుండా మంచినీళ్లు కూడా తాగకుండా ఉండటంతో ఆమె గృహ కోల్పోయిందని ఆమెకి విశ్రాంతి అవసరమని వైద్యులు తెలిపారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా ఏళ్ల తరబడి 500 నుంచి 1500 వరకు పని చేసుకుంటూ వస్తున్నామని ప్రభుత్వం కనీస వేతనం అమలు చేయకుండా వివోఏ లను నిర్లక్ష్యం చేస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. స్పృహ కోల్పోయిన వివోఏ అరుణ ను రాజకీయ పార్టీల జేఏసీ కన్వీనర్ మందడి ఇజ్రాయిల్ సిపిఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను పరామర్శించారు. ఆసుపత్రిలో వివోఏ వెంట జిల్లా అధ్యక్షురాలు వేల్పుల సుశీల, గుగ్గిళ్ళ ఉమా, కళమ్మ, బొడ్డు కుసుమ, మాధురి, మేకల కృష్ణవేణి, సిహెచ్ జ్యోతి, షేక్ జానీ, బేగం ఉపేంద్ర, సువర్ణ, ఉష, ఇందిరా, విజయ కుమారి, సుజాత, మంజుల, శ్రావణి, ధనలక్ష్మి, జయ, గోపోజి ఉపేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## అగ్నికి ఆహుతైన జామాయిల్, సుబాబుల్ తోటలు

**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలంలోని వెంకటాపురం గ్రామపంచాయతీ పరిధిలోని తాటిగూడెం, రామాపురం గ్రామ పంచాయతీలోని రేమిడిచర్ల రెవెన్యూ గ్రామాల్లో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో జామాయిల్, సుబాబుల్ తోటలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ట్రాన్స్ఫార్మర్‌ల వద్ద విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి ప్రమాదశాత్తు మంటలు చెలరేగి వేగంగా వ్యాపించడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. బాధిత రైతులు తెలిపిన ప్రకారం పొలాల్లో హైవొల్టేజ్ లైన్ల వద్ద ఏర్పాటు చేసిన ట్రాన్‌ఫార్మర్ వద్ద షార్ట్ సర్క్యూట్ తో మంటలు చెలరేగి తాటిగూడెం రెవెన్యూలో మొత్తం పది మంది రైతులకు చెందిను సుమారు ముప్పై ఎకరాల జామాయిల్ తోటలు, రేమిడిచర్ల రెవెన్యూలో నలుగురు రైతులకు చెందిన ఆరు ఎకరాలు సుబాబుల్ తోటలు పూర్తిగా కాలిపోయాయి. ఈ ఘటనలో జామాయిల్ తోటలకు సుమారు రూ.40లక్షలు, సుబాబుల్ తోటలకు రూ.6లక్షలు వరకు నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అగ్ని ప్రమాదం కారణంగా పూర్తిగా ఆర్థికంగా దెబ్బతిన్న తమను ప్రభుత్వం ఆదుకోవాలని వేముల వెంకటేశ్వరరావు, కూడెల్లి నాగేశ్వరరావు, చాప వెంకటేశ్వరరావు, నున్న సురేష్ తదితర రైతులు కోరుతున్నారు.

# జూనియర్ న్యాయవాదులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి

**-ఎంఎల్ఏ కూనంనేనిని కలిసి విన్నవించిన న్యాయవాదులు**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జూనియర్ న్యాయవాదులకు కూడా ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరుతూ ఫెడరేషన్ ఆఫ్ లీగల్ ప్రొఫెషనల్స్ కమిటీ బాధ్యులు, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) బాధ్యులు కొత్తగూడెం ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావుకు విన్నవించారు. ఆదివారం సిపిఐ కార్యాలయం గిరిప్రసాద్ భవన్‌లో ఫెడరేషన్ ఆఫ్ లీగల్ ప్రొఫెషనల్స్ కమిటీ అధ్యక్షులు దిలీప్ చౌదరి తాళ్లూరి, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) జిల్లా కోశాధికారి కొలికొండ శరత్‌బాబు తదితరులు ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావును కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 36వేల మంది న్యాయవాదులు ఉన్నప్పటికీ తాజాగా న్యాయవాదుల సంక్షేమ ట్రస్టు విడుదల చేసిన నోటిఫికేషన్‌లో కేవలం 20వేల మంది న్యాయవాదులకు మాత్రమే ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించినట్లు ప్రకటించారని తెలిపారు. 2019 నుంచి ఇప్పటి వరకు బార్ కౌన్సిల్‌లో నమోదు చేసుకున్న న్యాయవాదుల్లో సుమారు 15వేల మంది 35 సంవత్సరాల లోపు యువ న్యాయవాదులేనన్నారు. కెరీర్ ప్రారంభ దశలో ఉన్న వీరు అనేక ఆర్థిక వృత్తిపరమైన సవాళ్లను ఎదుర్కొంటున్నారని ఇన్సూరెన్స్ సౌకర్యం లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. యువ న్యాయవాదులకు కూడా ఇన్సూరెన్స్ వర్తింపజేస్తే వారి కుటుంబాలకు రెండు లక్షల ఇన్సూరెన్స్‌తో పాటు ప్రమాదవశాత్తు మరణించిన సమయంలో రూ.10లక్షల ఆర్థిక సాయం అందుతుందన్నారు. గత ప్రభుత్వం ప్రకటించిన రూ.100 కోట్లతో మరో రూ.100 కోట్లను న్యాయవాదుల సంక్షేమం కోసం అందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించినప్పటికీ ఇప్పటి వరకు ఆ నిధులు విడుదల కాలేదన్నారు. న్యాయవాదుల సంక్షేమ చట్ట బిల్లుపై ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావుతో పాటు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాత్రమే స్పందించారన్నారు. బిల్లు రూపకల్పన సమయంలో చాప్టర్ 2లో కార్పస్ ఫండ్ పొందుపర్చిన చట్టం రూపుదాల్చే సమయానికి ఆ చాప్టర్‌ను పూర్తిగా తొలగించారన్నారు. గతంలో న్యాయవాదుల సంక్షేమం కోసం కేటాయించిన రూ. 100 కోట్లతో పాటు ముఖ్యమంత్రి ప్రకటించిన మరో రూ.100 కోట్లను విడుదల చేసి, దానిపై వచ్చే వడ్డీని కూడా వెంటనే అందుబాటులోకి తీసుకువస్తే మిగిలిన 15,500 మంది న్యాయవాదులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించవచ్చునని ఎంఎల్ఏ కూనంనేనికి విన్నవించారు.

**ముఖ్యమంత్రితో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తాం : కూనంనేని**

జూనియర్ న్యాయవాదుల ఇన్సూరెన్స్ సమస్యతో పాటు న్యాయవాదుల సంక్షేమం కోసం కేటాయించిన రూ.100 కోట్ల అంశంపై త్వరలో ముఖ్యమంత్రిని కలిసి చర్చిస్తానని ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు తెలిపారు. న్యాయవాదుల సంక్షేమ చట్టం సందర్భంగా ఈ అంశాన్ని అసెంబ్లీలో కూడా ప్రస్తావించానని, కార్పస్ ఫండ్ విషయాన్ని మరోసారి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) నగర కార్యదర్శి ముమ్మడి సతీష్, కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# చిరస్మరణీయుడు నల్లమల గిరి ప్రసాద్

**- సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవిబాబు**



**ప్రజాపక్షం/ మధిర :** కార్మిక, కర్షక, పేద ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడిన నల్లమల గిరిప్రసాద్ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా మిగిలిపోయాడని, భూపోరాటాలకు నాయకత్వం వహించి లక్షలాది ఎకరాలను పేదలకు పంచిన ఘనత గిరిప్రసాద్‌కు దక్కుతుందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవిబాబు అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు సిపిఐ మాజీ జాతీయ ఉపప్రధాన కార్యదర్శి, మాజీ రాజ్యసభ సభ్యులు నల్లమల గిరిప్రసాద్ వర్ధంతిని ఆదివారం తొండలగోపవరంలో పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. తొలుత గిరి ప్రసాద్ స్మారక స్థూపాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో రవిబాబు మాట్లాడుతూ అప్పటి ఉమ్మడి ఖమ్మం జిల్లా కమ్యూనిస్టు ఉద్యమ ధృవతారగా వెలుగొందిన గిరిప్రసాద్ జీవితం, ఆయన జిల్లాకు చేసిన త్యాగం నేటి తరం కార్యకర్తలకు, నాయకులకు స్ఫూర్తిదాయకమని అన్నారు. కమ్యూనిస్టు ఉద్యమాలను నడిపించడంలో కీలకపాత్ర పోషించిన గిరిప్రసాద్ లేని లోటును పరిపూర్తి చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. నిజాం నిరంకుశపాలనకు వ్యతిరేకంగా ఆంధ్ర మహాసభ సాగించిన ఉద్యమం గురించి అధ్యయనం చేశారన్నారు. ఉన్నత విద్యను, ఆస్తులను సైతం వదిలివేసి ఉద్యమబాట పట్టిన నల్లమల సాయుధ పోరాటాన్ని బలోపేతం చేశాడన్నారు. ఆయా ప్రాంతాల్లో దళాలు జరిపిన దాడుల్లో గిరి ప్రసాద్ నాయకత్వం వహించిన గొప్ప ఆదర్శ నాయకుడు అని, సిపిఐ పార్టీ రాష్ట్ర జాతీయ ఉప కార్యదర్శిగా ఎంఎల్ఏ ఎంపిగా ప్రజలకు సేవలను అందించారని ఆయన కొనియాడారు. అప్పటి ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి రాజ్య సభ సభ్యుడిగా పనిచేసిన గిరిప్రసాద్ జిల్లా అభివృద్ధికి, పేదల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేశాడన్నారు. ఆయన చూపిన పోరాట మార్గంలో పయనిస్తూ నమ్మిన సిద్ధాంతాలను నెరవేర్చినప్పుడే నిజమైన నివాళి అర్పించిన వాళ్లమవుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.ఎ.రహీం, బోనకల్ సిపిఐ మండల మండల కార్యదర్శి యంగల ఆనందరావు, జిల్లా సమితి సభ్యులు పెరుమాళ్ళపల్లి ప్రకాశరావు, ఎఐటియూసి డివిజన్ కార్యదర్శి చెరుకూరి వెంకటేశ్వరరావు, కొండూరి నాగేశ్వరరావు, గ్రామపెద్దలు వాసిరెడ్డి సత్యం తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ దీపికల సమస్యలను పరిష్కరించాలి




**ప్రజాపక్షం/ తల్లాడ :** గ్రామాభివృద్ధిలో పాటుపడే గ్రామీణ ప్రాంతంలో పనిచేస్తున్న గ్రామీణ మహిళల అభివృద్ధిలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్న మహిళలను చైతన్యవంతం చేసే డ్వాక్రా సంఘాల గ్రామదీపికలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రం తల్లాడో గత మూడు రోజులు నుంచి నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న దీక్షాశిబిరాన్ని సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్, టియుసిఐ నాయకులు ఆదివారం సందర్శించి వారి సమ్మెకు సంఘీభావం ప్రకటించడం జరిగింది. ఈసందర్భంగా సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యవర్గ సభ్యులు షేక్.లాల్మియా, టియుసిఐ ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి డి.శ్రీనివాసరావు మాట్లాడుతూ అతి తక్కువ వేతనంతో పనిచేస్తున్న గ్రామదీపికల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యపు వైఖరిని అవలంభిస్తుందని, వేతనాలు పెంచపోవడంతో పాటు శ్రమ దోపిడికి గురి చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వేలాదిమంది గ్రామ దీపికలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గత మూడు రోజుల నుంచి సమ్మె చేస్తున్న ప్రభుత్వం నుండి స్పష్టమైన హామీ ఇవ్వలేకపోవడం వారి శ్రమని గుర్తించకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనమని వారు అన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వారి వేతనాలను పెంచాలని, హెల్త్ పాలసీలు అమలు చేయాలని, సీనియారిటీ ప్రాతిపదిక మీద సీనియర్ గ్రామ దీపికలను సీసీలుగా గుర్తించాలని, హెచ్ఆర్‌సి పాలసీని అమలు చేయాలని, గౌరవ వేతనం రూ.20వేలు ఇవ్వాలని, గ్రామదీపికలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని తదితర న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామదీపికల మండల అధ్యక్షురాలు డి.సుజాత, ప్రధాన కార్యదర్శి సిహెచ్.జయలక్ష్మి, కోశాధికారి సిహెచ్.కళావతి, ఉపాధ్యక్షులు కె.విజయలక్ష్మి, సహాయ కార్యదర్శి ఎన్.అనసూయ, పి.నాగప్రసన్న, కె.వెంకటకృష్ణమ్మ, ఆమని, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# వెంపటి ప్రభాకర్ చిత్రపటానికి నివాళి



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని 32వ వార్డుకు చెందిన కాంగ్రెస్ నాయకుడు వెంపటి సురేష్ సోదరుడు వెంపటి ప్రభాకర్ ఇటీవల మృతి చెందగా..ఆదివారం ఆయన దశదినకర్మను ఇంటి వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన చిత్రపటానికి మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇంఛార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, 29వ వార్డు కౌన్సిలర్ వెంపటి ఉమా, మున్సిపాలిటీ కాంగ్రెస్ నాయకులు వెంపటి రవి, లింగా వెంకటనారాయణ, వెంపటి వెంకన్న, అశోక్‌రెడ్డి, రంజిత్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# నిలువ నీడ లేక ప్రయాణికుల ఇబ్బందులు



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మున్సిపాలిటీలోని ప్రయాణికులకు నిలువ నీడ లేక ప్రయాణికులు పాట్లు పడుతున్నారు. మండే ఎండలకు బస్సులు కోసం ఎదురుచూసే సమయంలో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కల్లూరు లోని ఎన్ ఎస్ పి క్రాస్ రోడ్, సబ్ కలెక్టర్ కార్యాలయం, పాత బస్టాం డ్, అంబేద్కర్ నగర్ వద్ద నిలువ నీడ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో బస్సు షెల్టర్లు ఎండకు వానకు ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా బస్ షెల్టర్ ల నిర్మాణంకు గత మూడు సంవత్సరాల క్రితం నిర్మాణానికి తీర్మానాలు జరిగాయి. కల్లూరు నుంచి ఖమ్మం, సత్తుపల్లి తిరువూరు, మధిర ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రయాణికులు పాట్లు గమనించి వారి సౌకర్యార్థం బస్సు షెల్టర్లు నిర్మించేందుకు తీర్మానాలు జరిగాయి. ప్రస్తుతం బస్సు షెల్టర్లు నిర్మాణాలు నిర్మించేందుకు నిధులు కొరతతో వెనకాడినట్లు తెలియ వచ్చింది. ప్రస్తుతం షెల్టర్లు లేనందున చెట్లు నీడే దిక్కు అంటూ బస్సు వచ్చే వరకు ఉంటున్నారు. ప్రయాణికులు ఇబ్బందులను గమనించి ఆర్ అండ్ బి నేషనల్ హైవే వారు గమనించి ప్రయాణికుల అవసరాల నిమిత్తం బస్సు షెల్టర్లను నిర్మించాలని ఆయా శాఖల అధికారులను ప్రయాణికులు ప్రజలు కోరుతున్నారు.

# భగవద్గీత పోటీల్లో మిట్టపల్లి రాజ్యలక్ష్మికి ప్రథమ శ్రేణి




**ప్రజాపక్షం/వైరా:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన శృంగేరిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన భగవద్గీత పోటీల్లో వైరాకు చెందిన మిట్టపల్లి కిరణ్‌కుమార్ సతీమణి మిట్టపల్లి రాజ్యలక్ష్మి అద్భుత ప్రతిభ కనబరిచారు. పెద్ద ఎత్తున నిర్వహించిన ఈ పోటీల్లో మిట్టపల్లి రాజ్యలక్ష్మి తన స్పష్టమైన ఉచ్చారణతో ప్రథమ శ్రేణి సాధించి ప్రత్యేక గుర్తింపు పొందారు. రాజ్యలక్ష్మి సాధించిన ఈ విజయంపట్ల స్థానికులు, భక్తులు హర్షం వ్యక్తం చేస్తూ ఆమెకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# వివోఏల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి




**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** ఎన్నో సంవత్సరాల తరబడి ప్రభుత్వ ఒప్పంద కార్మికులుగా పనిచేస్తున్న వివోఏలు అత్యంత దుర్భర జీవితం గడుపుతున్నారని వారికి కనీస వేతనం అమలు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి కోమ్ము శ్రీను అన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వివోఏలు మే 18 నుండి సమ్మెలో భాగంగా చేపట్టిన దీక్షకు ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం వివోఏల పట్ల నిర్లక్ష్య ధోరణి విడనాడి వివోఏల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని వారికి కనీస వేతనం 20 వేల రూపాయలు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సుమారు 30 40 సంవత్సరాల నుంచి వివో ఏలు గ్రామాలలో స్వయం సహాయక సంఘాల సభ్యులను ఆర్థికంగా అభివృద్ధి చేస్తూ వస్తున్నారని ఆయన తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమల్లో వారిని భాగస్వాములు చేస్తూ వస్తున్నారని గ్రామస్థాయిలో ప్రజలతో మమేకమై ఉండే వివోఏ లతో అధికార పార్టీ నాయకులు వారిని ఎలక్షన్ సమయంలో పోల్ స్లిప్పులు పంపిణీ మొదలుకొని ఎన్నికల కేంద్రాల వద్ద పనులు పురమాయిస్తూ అనంతరం వారిని పట్టించుకోవట్లేదని ఆయన అన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి వారి కనీస వేతనం అమలు చేస్తూ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి నేరుగా వారి వ్యక్తిగత ఖాతాల్లో వేతనాన్ని అమలు చేయాలని 57 ఏళ్లు దాటిన వివోఏ లకు పెన్షన్లు జీవిత బీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో వివో ఏల జిల్లా అధ్యక్షురాలు వేల్పుల సుశీల, గుగ్గిళ్ళ ఉమా, మండాది కళమ్మ, బొడ్డు కుసుమ, ఎం.మాధురి, మేకల కృష్ణవేణి, సిహెచ్ జ్యోతి, షేక్ జానీ బేగం, ఉపేంద్ర, సువర్ణ, ఉష, ఇందిరా, విజయ కుమారి, సుజాత, మంజుల, శ్రావణి, ధనలక్ష్మి, జయ, గోపోజి, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

